ప్రజాశక్తి
శనివారం 18 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



ఇసుక కొరత ఉండరాదు

కలెక్టరేట్ : జిల్లాలో ఇసుక కొరత ఉండరాదని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఇసుక పరిస్థితిపై సంబంధిత అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమీక్షించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ముఖ్యంగా ప్రాధాన్యత పనుల నిర్మాణానికి ఇసుక కొరత తలెత్తరాదని చెప్పారు. కొన్ని ఇసుక రీచ్‌లను ప్రత్యేకంగా కేటాయించడం వల్ల సమస్య ఉండదన్నారు. వివిధ ఇసుక రీచ్‌ల్లో ఉన్న నిల్వలపై పక్కాగా అంచనాలు వేయాలని, పర్యావరణ అనుమతులకు దరఖాస్తులు చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో పనులు చేసేందుకు ఇసుక కొరత లేకుండా ముందుగా నిల్వ చేయాలని సూచించారు. నిల్వ చేసేందుకు సరైన ప్రదేశాలు గుర్తించాలని పేర్కొన్నారు. సమావేశంలో గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు చంద్ర నాయక్, సహాయ సంచాలకులు మల్లేశ్వరరావు, జిల్లా భూగర్భ జల అధికారి ఎ.రాజశేఖర రెడ్డి, డిపిఒ బలివాడ సత్యనారాయణ, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎస్.శంకరనాయక్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలి విజేత టిడిపి

8 రౌండ్లలోనూ చిరంజీవిరావుదే ఆధిక్యం ● సిట్టింగ్ బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ సహా 34 మందికి డిపాజిట్లు గల్లంతు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని టిడిపి దక్కించుకుంది. ఆ పార్టీ తరపున బరిలోకి దిగిన వేపాడ చిరంజీవిరావు విజేతగా నిలిచారు. ఈ నెల 16న ఉదయం 8 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా 17వ తేదీ రాత్రి వరకూ మండలి ఓట్ల లెక్కింపును సుమారు 500 మంది సిబ్బంది చేపట్టారు. టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. పోలైన మొదటి ప్రాధాన్య ఓట్లలో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు 82,977, సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లు వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. చిరంజీవిరావు విజయానికి ఇంకా 11,551 ఓట్లు అవసరం కావడంతో అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియకు వెళ్లారు. 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేషన్ చేస్తూ, వారికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లను కలిపే దిశగా ఎన్నికల సిబ్బంది కసరత్తు ఆరంభించారు. అయితే ఓ న్యాయవాది వేసిన కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం తమకు లోబడి ఉండాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో విజేతను ఎన్నికల అధికారి ప్రకటిస్తారా ? లేదా ? అన్నదానిపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి.

బిజెపికి డిపాజిట్ గల్లంతు

బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు 10,884 ఓట్లు రాగా డిపాజిట్ గల్లంతైంది. 2017లో టిడిపి మద్దతుతో మాధవ్ బిజెపి తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందారు. అంతకు ముందు 2007, 2011 సంవత్సరాల్లో వరుసగా పిడిఎఫ్ అభ్యర్థి ఎంవిఎస్ శర్మ ఈ స్థానంలో గెలిచారు. 2023లో టిడిపి నేరుగా వేపాడ చిరంజీవిరావును బరిలోకి దించి ఆ సీటు దక్కించుకోవడం విశేషం.

గెలుపునకు కారణాలివే..

విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన కౌంటింగ్ తొలి రౌండ్ నుంచీ టిడిపి అభ్యర్థే ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చారు. టిడిపికి జనసేనకు చెందిన పట్టభద్రులంతా ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచి ఓట్లేశారు. అధికార పార్టీ వైసిపిపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత కూడా టిడిపికి కలిసొచ్చింది. 20 ఏళ్లకు పైగా వేపాడ చిరంజీవిరావు ఆర్‌సి రెడ్డి కోచింగ్ సెంటర్, ఇతర కళాశాలల్లో ఎకానమీ లెక్చరర్‌గా కోచింగ్ ఇస్తూ పలువురు శిష్య బృందాన్ని తయారు చేసుకోవడంతో వారంతా ఈ ఎన్నికల్లో ఓటర్లను కలిసి ఆయన విజయానికి చేదోడుగా నిలిచినట్లు తెలుస్తోంది.

వైసిపికి దెబ్బ

ఐదుగురు మంత్రులు, ఇద్దరు డిప్యూటీ సిఎంలు, ఆరుగురు ఎంపీలు, ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల సమన్వయ కమిటీల నేతలు కలిసినా కూడా వైసిపిని ఈ ఎన్నికల్లో గెలిపించుకోలేక పోయారన్న విమర్శలను అధికార వైసిపి ఎదుర్కొంటోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో ఓట్లను సాధించడంలో పైచేయి సాధించలేకపోయారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికార వైసిపికి దెబ్బ కొట్టారన్నది స్పష్టంగా తేలిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును అత్యధికంగా టిడిపి లాక్కోగలిగింది. ఎన్నికల బరిలోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చిన చిరంజీవి.. ఓట్ల నమోదులో కూడా గణనీయ పాత్రమీ పోషించలేదు. అయినప్పటికీ ఎమ్మెల్సీ స్థానంలో విజేతగా నిలవడం చూస్తే వైసిపి వ్యతిరేకత పట్టభద్రుల్లో ఎంత ఉందో వెల్లడవుతోంది. అనూహ్యమైన రీతిలో తెలుగుదేశం పార్టీ బరిలోకి దిగి ఈ స్థానాన్ని కైవసం చేసుకోగలిగింది. గతంలో గాడు చిన్న కుమారి లక్ష్మిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బరిలోకి దింపారు. ఆమెను మార్చాలని ఆయనపై టిడిపి శ్రేణులు ఒత్తిడి తేవడంతో చిరంజీవిరావును బరిలోకి దింపి వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయం సాధించారు.

ప్రధాన అభ్యర్థులు ఎవరేమన్నారంటే ?

తానే గెలవనున్నానన్న ధీమా తొలి నుంచీ ఉందని చిరంజీవిరావు తెలిపారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తనను దెబ్బతీసిందంటూ వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ వెల్లడించారు.



కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న వేపాడ చిరంజీవిరావు



కురుపాంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులు

ఓటర్లకు ధన్యవాదాలు

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

విశాఖ కలెక్టరేట్ : మండలి ఎన్నికలలో తనకు ఓటు వేసిన వారందరికీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలను సాధారణ ఎన్నికల్లా రాజకీయ పార్టీలు మార్చేసినా.. ఎలాంటి ప్రలోభాలకూ లోనవకుండా 35 వేల మందికి పైగా పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేశారన్నారు. నిస్వార్థంగా ప్రచారంలో పాల్గొని, అహర్నిశలూ కృషి చేసిన ప్రజా సంఘాల కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

మూడో రైల్వే లైన్ పనులను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక పట్టణ రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న మూడవ లైన్ రైల్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని రైల్వే సిబ్బందిని కలెక్టర్ నిశాంత్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఐవి గురునాథరావుతో కలిసి పనులను పరిశీలించారు. పనుల వివరాలను సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వివరించారు. విజయనగరం - టిట్లఘర్ మధ్య నిర్మిస్తున్న రైల్వే మూడో లైను పనులను 265 కిలో మీటర్ల మేర రూ.2335.68 కోట్లతో చేపట్టడం జరుగుతోందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 44 కిలో మీటర్లు చేపడుతున్నామని, ఇందులో మేజర్ బ్రిడ్జిలు మూడు, ఆరు ఆర్.యు.బిలు, 135 మైనర్ బ్రిడ్జిలు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కూనేరు నుంచి సీతానగరం వరకు పనులు జరుగుతున్నాయన్నారు. పార్వతీపురంలో అదనపు కాలినడక వంతెన, బుకింగ్ కార్యాలయం, కూనేరు, గుమడ, పార్వతీపుం, సీతానగరంలో మెరుగైన సౌకర్యాలతో కొత్త స్టేషన్ భవనాలు రానున్నాయని చెప్పారు.



మూడో రైల్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గాలులకు నేలకొరిగిన అరటి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

తుఫాన్ ప్రభావంతో గురువారం సాయంత్రం గాలులు వీయడంతో మండలంలో పలు గ్రామాల్లో అరటి పంట నేలకొరిగింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వేలాది రూపాయలు అరటి పంటకు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వస్తున్న సమయంలో గాలుల ప్రభావంతో పంటను నష్టపోయారు. ఆదాయం పెరుగుతుందని ఆశించి అరటి పంటను వేస్తున్నామని, గాలుల తీవ్రతతో పంట నేలకొరగడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని రైతన్నలు లబోదిబోమంటున్నారు. మండలంలో సుమారు 7 వేల ఎకరాల్లో అరటి పంట సాగవుతోంది. మండలంలోని పెద మేరంగి, కన్నపుదొరవలస, బిత్రపాడు, బాసంగి, గౌరమ్మపేట, చింతల బెలగాం, పరజపాడు, కుదమ, కుందలతిరువాడ పంచాయతీల్లో అరటి పంటను ఎక్కువగా సాగవుతోంది. అరటి తోటలు గాలుల ప్రభావంతో నేలకొరగ డంతో అన్నదాతలు ఆవేదనకు గురిచేసింది.



బాసంగిలో నేలకొరిగిన అరటి మొక్కలు



పరీక్షా కేంద్రంలో విద్యార్థులు

ఐదుగురు విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 25,274 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ జనరల్ పరీక్షకు 20,908 మంది హాజరు కావాల్సి ఉండగా, 19,872 మంది హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 6146 మంది హాజరు కావాల్సి ఉండగా, 5402 మంది మాత్రమే హాజరయ్యారు. మొత్తం రెండు పరీక్షలకు కలిసి 1780 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ఐ నాలుగు పరీక్షా కేంద్రాలను, డిఇసి మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు కూడా విస్తతంగా తనిఖీలు నిర్వహించాయి. పలు కేంద్రాల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతున్న ఐదుగురు విద్యార్థులపై కేసులు నమోదు చేశారు. పి.కోనవలసలో ఇద్దరు, మెరక ముడిదాంలో ఇద్దరు, ఎస్.కోటలో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డిబార్ చేసినట్లు ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ తెలిపారు.

128మంది విద్యార్థులు గైర్హాజరు

కురుపాం : ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 511 మంది విద్యార్థులకు గానూ 383 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 128 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని పరీక్ష నిర్వహణ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం జరిగినటువంటి ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు ప్రత్యేక స్క్వాడ్ బృందం పరిశీలించారని, ఎక్కడ కూడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు.

జియమ్మవలస : మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 649 మంది విద్యార్థులకు గాను 77 మంది గైర్హాజరైనట్టు చీఫ్ సూపరిండెంట్ శివప్రసాద్ తెలిపారు. జనరల్ కోర్స్‌తో పాటు ఒకేషనల్ విద్యార్థులకు ఇంగ్లీష్ పరీక్ష జరిగిందని, ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి తనిఖీలు నిర్వహించినట్లు సిఎస్ తెలిపారు.

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సిఎస్‌పి శంకర్రావు తెలిపారు. 280 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరయ్యారన్నారు.

'సీతం'లో మెషీన్ లెర్నింగ్‌పై శిక్షణ

విజయనగరం : సీతం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మెషీన్ లెర్నింగ్ పై రెండు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభమైనది. మొదటి రోజు ' ఎండ్ టు ఎండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ మెషీన్ లెర్నింగ్ ఇన్ బ్యాంకింగ్' అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన విఐసిఎ ఐఎన్‌సి డైరెక్టర్ ఆరవిల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. బ్యాంకింగ్‌లో మెషీన్ లెర్నింగ్ అమలు గురించి వివరించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలి

జెఎన్‌టియు విసి వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతి విద్యార్థీ మల్టీ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని జెఎన్‌టియ వైస్ ఛాన్సలర్ వెంకటసుబయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు యూనివర్సిటీలో జాతీయ స్థాయి టెక్నో సింపోజియం సదస్సును విసి వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు తెలుసుకోవాలన్నారు. ఇటువంటి సదస్సులు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికతీసేందుకు దోహదం చేస్తాయన్నారు. గ్రూప్ చర్చలు ద్వారా భావాలను పంచుకోవడం ఇతరుల నుంచి మరింత జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. విద్యతో పాటు ఇతర అంశాలపై కూడా అవగాహన అవసరం పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, వివిధ విద్యా సంస్థల విద్యార్దులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి వెంకట సుబ్బయ్య

కెమిశీల పాఠశాలలో పిఒ తనిఖీ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కెమిశీల ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రమాణాలు, ఆహార పదార్థాల తయారీ తదితర వివరాలను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆదేశించారు. చక్కని భవితకు పునాదులు వేయాలని స్పష్టం చేశారు. ప్రతి తరగతిలో ప్రమాణాలు మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉన్నత విద్యావకాశాలు తెలియజేయాలని, అందుకు అనుగుణంగా బోధన అందించాలని పిఒ అన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు వెనుకంజలో ఉండరాదని స్పష్టం చేశారు. మంచి ఆహారాన్ని అందించాలని, తద్వారా విద్యపై దృష్టి సారించగలరని ఆయన చెప్పారు. ఆహార పదార్థాల తయారీ సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం తీవ్ర పరిస్థితులకు దారితీస్తుందని గ్రహించాలని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

డిమాండ్ల సాధనకు

ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు అమరావతి జెఎసి పిలుపు మేరకు శుక్రవారం పార్వతీపురంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో చేయి.. చేయి కలుపు కార్యక్రమం ద్వారా కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భం జెఎసి జిల్లా చైర్మన్ జి.శ్రీరామ్మూర్తి, సెక్రటరీ జనరల్ డిజి ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకుని తమ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేంత వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అందుకు అన్ని వర్గాల వారిని కలుపుకునేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా ఉద్యమ కార్యాచరణ అమలు చేసి సమ్మెకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు.

మక్కువ : రెవెన్యూ ఉద్యోగులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి జెఎసి పిలుపు మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సూర్యనారాయణ మాట్లాడుతూ పిఆర్‌సి, డిఎ, బకాయి నిలిపివేత వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఏప్రిల్ 5 వరకు నిరసన జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపున్న ప్రభుత్వ ఉద్యోగులు


20న చలో విజయవాడను జయప్రదం చేయండి

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి -కలెక్టరేట్

అంగన్‌వాడీ వర్కర్లకు ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకై ఈనెల 20న జరుగు చలో విజయవాడను జయప్రదం చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రతి కార్యకర్త, ఆయా విధిగా హాజరు కావాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో గోడ పత్రికను జిల్లా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, వైయస్సార్ సంపూర్ణ పోషణ అమలుకు బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అంగన్వాడీలు అప్పు చేసి కేంద్రాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రకరకాల యాప్‌లు తీసుకొనిచ్చి పని భారాన్ని పెంచి, అంగన్వాడీలకు ఇచ్చిన సెల్ ఫోన్లు పనిచేయడం లేదన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ కేంద్రాల బలోపేతానికి నిధులను పెంచి అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ అంగన్వాడి వర్కర్‌కు అమలు కావడం లేదని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, 2017 సంవత్సరం నుండి పెండింగ్లో ఉన్న టిఎలను వెంటనే చెల్లించాలని తదితర సమస్యలపై ఈనెల 20న తలపెట్టిన చలో విజయవాడలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు రాజేశ్వరి, పార్వతి, విజయలక్ష్మి, గౌరీ, మణి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఈనెల 20న విజయవాడలో చేపట్టబోయే మహా ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిరా పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం భద్రగిరి ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సత్యవతి, పలువురు కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో చలో విజయవాడ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అంగన్‌వాడీలు

కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పురపాలక సంఘాల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.సూరిబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని విభాగాల కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ విభాగంగా కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు రక్షణ సామాగ్రి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఎన్.నిర్మల, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు

సాలూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్సు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న కార్మికులకు ముఖహాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కమిషనర్ హెచ్.శంకరరావుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.రవి, టి.ఇందు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



రోడ్డు పనులకు మార్కింగ్ చేస్తున్న ఆర్అండ్‌బి అధికారులు

రహదారి విస్తరణ పనులకు మార్కింగ్

కురుపాం: కురుపాం ప్రధాన రహదారి విస్తరణకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, గృహాలకు ఆర్అండ్‌బి డిఇ నాగమోహన్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం మార్కింగు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి నుంచి కురుపాం అటవీశాఖ కార్యాలయం వరకు మంజూరైన రహదారి విస్తరణ పనులకు కురుపాం గ్రామ చివరి వరకు జరిగాయని, ఇప్పుడు కురుపాంలో రహదారికి మధ్య నుంచి ఒక్కొక్క వైపు ఏడు మీటర్ల చొప్పున విస్తరణ జరుగుతుందని, కొన్ని దగ్గర్లో పెరగవచ్చునని తెలిపారు. వారికి ఐదు రోజుల సమయం ఇచ్చామని జెసిబి కూడా ఇస్తామని చెప్పారు. ఐదు రోజుల్లో వారు తొలగించకపోతే తాము దగ్గరుండి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఇ నిర్మల కుమారి, ఆర్ అండ్ బి సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారికి తనిఖీ చేస్తున్న వైద్యాధికారి శిరీష

అప్పయ్యపేటలో 104 వైద్య శిబిరం

సీతానగరం : మండలంలోని అప్పయ్యపేటలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి కె శిరీష ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బిపి, సుగర్, జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసిసభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ, గ్రామ పెద్దలు, రోగులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

పాలకొండ రూరల్: మండలంలోని అంపిలి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు పిఎంఎవై, ఎస్‌డిజి సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సిబ్బంది సమయపాలన పాటించి, విధులకు హాజరు కావాలని, వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. అలాగే గ్రామంలోని ఎంపియుపి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

గుమ్మలక్ష్మీపురం : శ్రీ కైలాసనాథ ఆలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణం అనంతరం శివపార్వతుల విగ్రహాలను గుమ్మలక్ష్మీపురం పురవీధుల్లో శుక్రవారం సాయంత్రం ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కళశాలు పట్టుకొని ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గోరీశంకరరావు, ఉప సర్పంచ్ కొత్తకోట శివాజీ, ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్తకోట విష్ణుప్రసాద్, కమిటీ సభ్యులు గుడ్ల హరిప్రసాద్, కోజీశ సూర్యం, మద్ది దొరబాబు, ఎద్దు మురళి తదితరులు పాల్గొన్నారు.

కైలాసనాథ్ యాత్రకు 60మంది పోలీసు సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం : కైలాసనాథ దేవాలయం 40వ వార్షికోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్విన్‌పేట పోలీసులు ముందస్తు జాగ్రత్త చేపట్టారు. ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న 60 మంది పోలీస్ సిబ్బందిని యాత్ర సందర్భంగా నియమించారు. యాత్రలో ప్రజా రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిఐ సత్యనారాయణ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు ఉన్నారు.

చిరంజీవి విజయంపై హర్షం

కురుపాం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి వి.చిరంజీవిరావు గెలుపొందిన పట్ల ఆ పార్టీ మండల కన్వీనర్ కెవి కొండయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయం నుంచి పురవీధుల్లో నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపొందడానికి ఇదే తొలి మెట్టని అన్నారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నాయకులు కెవిడి రామరాజు, బమ్మిడిపాటి కన్నా, కర్రి శ్రీనివాసరావు, కొత్తకోట విశ్వనాథం, కె.చంటి తదితరులు పాల్గొన్నారు.



రోగికి నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యాధికారి

ఏరియా ఆస్పత్రిలో గ్లకోమా వారోత్సవాలు

పాలకొండ : స్థానిక ఏరియా ఆసుపత్రిలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు ఈనెల 12 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగభూషణరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నేత్ర రోగులకు ఎంతగానో ఉపయోగపడుతాయని, దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఐ స్పెషలిస్ట్ రామకృష్ణ రోగులకు కంటి పరీక్షలు చేసి సూచనలు ఇచ్చారు ఆపరేషన్ అవసరం ఉన్నవారికి ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. ఉచితంగా ఆపరేషన్లు మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ రవీంద్ర కుమార్, డిపిఎం త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోట దుర్గ ఆలయ పున ప్రతిష్ఠ

వీరఘట్టం : మండల కేంద్రంలోని శ్రీ కోటదుర్గ అమ్మవారి ఆలయ పున: ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. ప్రముఖ యాజ్ఞకర్త సర్వజ్ఞోషుల శ్రీవెంకటలక్ష్మీ నరసింహ శర్మ యాజి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ పునర్మాణానికి 250 మంది దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు సకల మర్యాదలు చేశారు.

మార్కెట్లోకి 5కేజీల చింతపండు ప్యాకెట్లు


గుమ్మలక్ష్మీపురం : బయట మార్కెట్లో నేటి నుంచి అమ్మేందుకు జిసిసి అధికారులు 5 కేజీల చింతపండు ప్యాకెట్లను సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జిసిసి బ్రాంచి కార్యాలయంలో ఐదు కేజీల ప్యాకెట్లు సిబ్బంది తయారు చేస్తున్నారు. 5 కేజీల ప్యాకెట్ ధర బయట మార్కెట్లో రూ.210కు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆలోచనతో మొబైల్ వాహనం ద్వారా అమ్మకాలు చేపడుతున్నట్లు జిసిసి మేనేజర్ కృష్ణప్రసాద్ తెలిపారు. జిసిసి ద్వారా 10 టన్నుల 5 కేజీల చింతపండు ప్యాకెట్లు అమ్మకాలు చేపట్టేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిసిసి అకౌంటెంట్ గణపతి ఉన్నారు.



ఐదు కేజీల చింతపండు ప్యాకెట్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్న జిసిసి అధికారులు

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్



జె.రామప్పలనాయుడు
కమిషనర్, పార్వతీపురం

ఈనెల 31లోగా ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేయబడుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీలో ఆస్తి, ఖాళీ స్థలం పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరానికి బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్ టైమ్ మెజర్‌గా మాఫీ చేశామని, పన్ను చెల్లించాల్సిన పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరంతో సహా ఈనెల 31లోగా చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని, కావున ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ మినహాయింపు లబ్ధిని పొంది మీ ఆస్తి, ఖాళీ స్థలం పన్ను బకాయిలను వడ్డీ లేకుండా ఒకే సారి చెల్లించా లని, బకాయి దారులు పన్నులను మున్సిపల్ కార్యాలయంలో గానీ మీ వార్డులో గల సచివాలయంలో గానీ ఆన్-లైన్ ద్వారా (https://cdma.ap.gov.in) నెట్-బ్యాంకింగ్ ద్వారా కానీ, డెబిట్ / క్రెడిట్ కార్డుల ద్వారా కానీ, యుపిఐ ద్వారా కానీ చెల్లించవచ్చునని కమిషనర్ పేర్కొన్నారు.

సాలూరు : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆస్తి, ఖాళీ జాగా పన్నులకు సంబంధించిన బకాయిదారులు ఈనెల ఆఖరులోగా వడ్డీ మినహాయింపును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి, ఖాళీ జాగా పన్నులకు సంబంధించిన వడ్డీ మినహాయింపు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. బకాయిదారులు సమీపంలోని సచివాలయాల్లో గాని, మున్సిపల్ కార్యాలయంలో గాని, ఆన్ లైన్‌లో గాని నన్ను బకాయిలు చెల్లించుకోవచ్చునని కమిషనర్ శంకరరావు తెలిపారు.

గేట్‌లో పెదబొండపల్లి విద్యార్థికి 35వ ర్యాంకు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లికి చెందిన గుంట్రెడ్డి సాయికృష్ణమోహన్ గురువారం విడుదలైన గేట్ ఫలితాల్లో ఆలిండియా 35వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు. కాలికట్‌లో ఎన్ఐటిలో బిటెక్ పూర్తిచేసిన కృష్ణమోహన్, ఇంకా ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు.

ఏకలవ్యలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో గిరిజన విద్యార్థుల ఆరో తరగతి ప్రవేశం, 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీకి గానూ అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎర్రునాయుడు తెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా ఏకలవ్య పాఠశాల వెబ్సైట్లో పంపించాలని తెలిపారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు స్వీకరించనున్నట్టు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రాజెక్టు కార్యాలయాన్ని తరలించొద్దు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని సుమారు 70 శాతం అంగన్వాడీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే ఐసిడిఎస్ రూరల్ ప్రాజెక్టు కార్యాలయాన్ని తరలించొద్దని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.జ్యోతి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాలూరు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అంగన్వాడీ వర్కర్లు, కార్యకర్తలకు ప్రస్తుతం ఉన్న రూరల్ ప్రాజెక్టు కార్యాలయం ఎంతో సౌలభ్యంగా ఉందని, దీన్ని ఇప్పుడు అర్బన్‌లో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ నిర్ణయంతో సాలూరు అర్బన్ ప్రాజెక్టు ఆఫీస్‌కు రూరల్ ప్రాజెక్టులో వుండే కార్యకర్తలు వెళ్లేందుకు అనేక ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. రూరల్ ప్రాజెక్టు సుమారు 40కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని, అందులో చాలా వరకు బస్ సౌకర్యం లేదని, సెక్టార్ ప్రాజెక్టు సమావేశాలకు ప్రస్తుతం అందుబాటులో ఉందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఈ కార్యాలయాన్ని తరలిస్తే గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని యథావిధిగా రూరల్ కార్యాలయాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆరిక నారాయణమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు సుభద్ర, గౌరీశ్వరి, పార్వతి, అరుణ, స్వప్న పాల్గొన్నారు.



దగ్ధమైన జీడిపంటను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

జీడి తోట దగ్ధం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గులుమూరు పంచాయతీ ఆడాలిలో శుక్రవారం సుమారు 30 ఎకరాల్లో జీడి తోటలు దగ్ధమైంది. గ్రామానికి చెందిన టి.నారాయణ, ఎస్.నరసింహులు, టి.సీతయ్య, ఎండయ్య, విశ్వనాథం, ఎన్.రామారావుకు చెందిన జీడితోట దగ్ధమైంది. ప్రమాదానికి కారణాలకు ఇంకా తెలియరాలేదు. చేతికొచ్చిన పంట బుగ్గిపాలవ్వడంతో ఆర్థికంగా తాము ఇబ్బందులు పడతామని బాధిత రైతులు కన్నీరు మున్నీరై రోధిస్తున్నారు. విషయం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి నష్టం వివరాలను సేకరించారు.

ఫిష్ ఆంధ్రా ప్రాజెక్టుకు అదనపు సబ్సిడీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఫిష్ ఆంధ్రా-ఫిట్ ఆంధ్రా ప్రాజెక్టు కు అదనపు సబ్సిడీని మంజూరు చేసినట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ ఏజెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిష్ ఆంధ్రా లబ్ధిదారుల ఎంపిక, షాప్ ఎంపిక, డిసిసిబి బ్యాంక్ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. జనరల్ కేటగిరీలో 40 శాతం సబ్సిడీ, మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీలో 60 శాతం సబ్సిడీని మంజూరు చేయనున్నట్టు తెలిపారు. శ్రీనిధి ఫండ్స్ ద్వారా డిఆర్‌డిఎ ఆర్థిక సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఫుడ్ ప్రోసెసింగ్ ద్వారా 39 శాతం సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. మినీ ఫిష్ రిటైల్ ఔట్లెట్ల యూనిట్‌కు రూ.లక్ష నుండి రూ.3లక్షల వరకూ ఉండగా లబ్దిదారుని వాటా పది శాతం చెల్లించాలని సూచించారు. లబ్ధిదారులకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రుణ సదుపాయాన్ని కల్పిస్తామని వివరించారు. రూ.10లక్షలు, రూ.20లక్షల కోబ్రాండింగ్, బిఎఫ్ఎఫ్, ఫిష్ ఆంధ్రా డెయిలీ డెలిషియస్, సూపర్, ఫిష్ కియోస్క్, లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్ యూనిట్లకు 40 నుంచి 60 శాతం వరకూ సబ్సిడీ, రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. సొంతంగా లేదా అద్దెకు షెడ్, కంటేనర్ ఉండాలన్నారు. ఔత్సాహిక, నిరుద్యోగ యువకులు, ఎస్‌హెచ్‌జి, ఎన్‌జిఒలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు స్థానిక మత్స్య శాఖ జిల్లా అధికారి ఫోన్ నెంబర్ 9701463640 కు సంప్రదించాలని సూచించారు. పాలకొండ/భద్రగిరి మత్స్య శాఖ అభివృద్ధి అధికారి 9441279251, పార్వతీపురం/సాలూరు ఎఫ్‌డిఒ 8309206895, స్థానిక సచివాలయం, గ్రామ మత్స్య సహాయకులను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్ మూర్తి, టిపిఎంయు ఎపిడి వై.సత్యం నాయుడు, మత్స్య అభివృద్ధి అధికారులు, మత్స్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



నిర్వాసిత కాలనీని పరిశీలిస్తున్న తహశీల్దార్ రాధాకృష్ణ

నిర్వాసితుల ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - కొమరాడ

తోటపల్లి నిర్వాసితులకు ఇచ్చిన పునరావాస కేంద్రాల్లో ఇళ్ల స్థలాలను తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ పరిశీలించారు. మండలంలోని గుణానపురం పునరావాస కేంద్రంలో నిర్మాణాలు చేపట్టిన ఇళ్ల స్థలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఎంతమంది అర్హులకు పట్టాలిచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. ఎంతమంది అర్హులున్నారని విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హులైన వారికి ఎంత మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలను పరిశీలించారు. ఇప్పటికే నిర్వాసితుల సౌకర్యాల నిమిత్తం పునరావాస గ్రామంలో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. గ్రామంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టిన ఆలయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎంతమంది నిర్వాసితులకు పట్టాలిచ్చారు. ఎంతమంది నిర్వాసితులు ఇళ్లు కట్టుకున్నారు, ఇంకా ఎంత మందికి ఇళ్ల స్థలాలు అవసరమో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పునరావాసం కోసం సేకరించిన స్థలాలు ఎన్ని ఎకరాలు సేకరించారు, వాటి సర్వే నెంబర్లు పూర్తిస్థాయిలో తెలియజేయాలని ఆదేశించారు. తక్షణమే గ్రామంలో ఉన్న అర్హులు జాబితాను అనర్హుల జాబితాను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విఆర్ఒ వెంకటనాయుడు గ్రామస్తులు ఉన్నారు.

కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

మహిళా దినోత్సవ వారోత్సవాల్లో ప్రిన్సిపల్

ప్రజాశక్తి - సాలూరు

మహిళలు వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కేన్సర్ లాంటి వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధాకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాలికలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేన్సర్‌పై ప్రాథమిక దశలోనే అవగాహన ఉంటే వైద్యుల సలహా మేరకు త్వరగా నిర్మూలించుకోవచ్చునని చెప్పారు. యోగాసనాలు చేయడం వల్ల కూడా మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. దంత వైద్యులు డాక్టర్ పావని మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో దంత పరిరక్షణ చాలా కీలకమైదన్నారు. దంతాల పరిరక్షణ చూసుకుంటే చాలా వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ జిల్లా పిడి వరహాలు, సిడిపిఒ సత్యవతి, ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాధాకృష్ణ

పెద్దూరులో అంధకారం

వీరఘట్టం : మండలంలోని దశమంతపురం పంచాయతీ పెద్దూరులో విద్యుత్ సరఫరా లేక గ్రామస్తులు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారు. గురువారం సాయంత్రం పడ్డ చిన్నపాటి చినుకులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. కొండలకు గ్రామం సమీపంలో ఉన్నందున జంతువులతో పాటు విష సర్పాలు కూడా గ్రామాలకు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

అకాల వర్షాలతో జీడి మామిడికి నష్టం

సీతంపేట : గత రెండు రోజులుగా తుఫాను కారణంగా కురిసిన అకాల వర్షాలకు జీడి మామిడి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు, ఇప్పటికే మంచు ప్రభావంతో జీడి పూత రాలిపోగా, ఇప్పుడు కురిసిన అకాల వర్షాలకు పిందెలు రాలిపోవడంతో మరింత నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆధునిక సమాజంలో ప్రతి జీవి ఆరోగ్యంగా ఉండాలంటే పురాతన కాలం నుంచి వస్తున్న ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ యశోదమ్మ తెలిపారు. మండలంలోని కూర్మరాజుపేటలో ప్రకృతి వ్యవసాయం చిరు ధాన్యాలు సాగుపై కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణలో ఆమె పాల్గొన్నారు. ఆధునిక సమాజంలో ప్రతి మనిషి తినే ఆహారం కలుషితమైందని, పండించే పంటలను విపరీతమైన ఎరువులు, పురుగులు మందులు వాడడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఇటువంటి విధానం చాలా ప్రమాదకరమన్నారు. పురాతన కాలం నుంచి మనకు వస్తున్న ప్రకృతి వ్యవసాయం చిరుధాన్యాలను పండించడం వల్ల భూమి సారవంతమవుతుందని, దాంట్లో పండించే పంటలను మానవునికి ఎంతో ఆరోగ్యకరమని అన్నారు. పెట్టుబడులు కూడా చాలావరకు తగ్గుతాయని తెలిపారు. ఈ విధానంపై రైతులకు కార్యకర్తలు అప్రమత్తం చేసి అందర్నీ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచడానికి తోడ్పడాలన్నారు. ఎప్పటికప్పుడు రైతులకు తగిన సూచనలు, సలహాలను అందించాలని కోరారు. ఇప్పటికే 15 మండలాల నుంచి సుమారు 267 గ్రామపంచాయతీల్లో 36,137 మంది రైతులు విధానాన్ని అవలంబిస్తున్నారని, దాన్ని త్వరలో అన్ని గ్రామపంచాయతీల్లో గల రైతులకు శత శాతం ప్రకృతి వ్యవసాయం వైపు వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం ప్రస్తుతం వంద బయో గ్రామాలను గుర్తించామని, ప్రతి కార్యకర్త రైతులకు అందుబాటులో ఉండాలని, ఆర్‌బికెలను ఉపయోగించుకొని రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శ్రీను, కుమారి, సూరిబాబు, రైతులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు


మురుగునీటి నిల్వతో దోమల వ్యాప్తి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మురుగునీరు గృహ పరిసరాల్లో నిల్వ ఉంచడం వల్లే దోమలు వ్యాప్తి చెంది, వివిధ రోగాలకు కారణమౌతు న్నాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాధరావు అన్నారు. మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యసిబ్బంది బాలగొడబ లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించిన ఆయన గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి దోమలు వ్యాప్తి నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమలు వల్ల కలిగే వ్యాధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ పరిసర ప్రాంతాల్లో గాని ఆరుబయటగానీ ఖాళీ టైర్లు, కొబ్బరిబొండాలు, విరిగిపోయిన పాత్రలు, నీటికుంటల్లో మురుగు నీరు నిల్వ ఉంచడం వల్ల దోమలు ఆవాసాలుగా మార్చుకుని సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయని, దీనివల్ల ఇళ్లలోకి ప్రవేశించి అనారోగ్యానికి కారణమౌతాయని వివరిస్తూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలను శుభ్రపర్చుకోవాలని పిలుపినిచ్చారు. కార్యక్రమంలో పిహెచ్ వైద్యాదికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, సిహెచ్ఒ జగదీష్‌కుమార్, ఆశా తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న జెవివి నాయకులు కృష్ణాజీ

విద్యార్థులు మానసిక ఒత్తిడి తగ్గించుకుంటే మంచి మార్కులు సాధించవచ్చునని జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలంటే సులువైన పద్ధతిలో నేర్చుకోవాలన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు మానసిక ఒత్తిడిని గురికాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతను సాధించాలనే లక్ష్యంతోనే ఉంటారని, అందుకోసం తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. విద్యార్థులు చదివేందుకు అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివున్నాయుడు, స్కూల్ చైర్మన్ నాగేశ్వరరావు, విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డి వార్మింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - కొమరాడ

గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు అన్నారు. గర్భిణులకు శుక్రవారం నిర్వహించిన డీ వార్మింగ్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని విక్రంపురంలో డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు, మూడు త్రైమాసికంలో ఉన్న గర్భిణులకు వైద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వారి పరిధిలో వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేయించామని అన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారిగా పర్యవేక్షించామన్నారు. ఈ మేరకు ఆయన విక్రంపురంలో గర్భిణులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయకుమారి, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది ప్రమీల, అనూష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.